# సీజనల్ అని నిర్లక్ష్యం వద్దు..

- ప్రమాదకరం కాకపోయినా.. అనారోగ్య సమస్యలకు దారితీయవచ్చు..
- కరోనాపై వైద్యనిపుణుల హెచ్చరిక

సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సాధారణ జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సీజనలే కదా.. అని నిర్లక్ష్యం చేయవద్దంటూ వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం చలికాలం కావడంతో సాధారణంగానే వైరల్ ఫీవర్స్, ఫ్లూ వంటి వ్యాధులు వస్తుంటాయి. కాని, మరోసారి కరోనా కేసులు నమోదవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎలాంటి లక్షణాలు కనిపించినా సకాలంలో వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని వైద్యులు చెబుతున్నారు. మూడు రోజుల్లో జ్వరం తగ్గకపోయినా..! అనుమానిత లక్షణాలు కనిపించినా..! వెంటనే కరోనా పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం దేశంలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న జేఎన్.1 వేరియంట్‌పై పూర్తి స్థాయి సమాచారం లేదని, ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం జేఎన్.1 లక్షణాలు సీజనల్ వ్యాధుల లక్షణాల్లా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

### వేగంగా వ్యాప్తిచెందే స్వభావం ఉండటం వల్లే..

2020, 2021లో వచ్చిన వేరియంట్లతో పోల్చితే ఆ తరువాత వచ్చిన ఒమిక్రాన్ వేరియంట్ వ్యాపించే స్వభావం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం మరోసారి అలజడి సృష్టిస్తున్న జేఎన్.1.. ఒమిక్రాన్‌కు ఉపవేరియంటే కావడం వల్ల ఈ వేరియంట్ సహజంగానే వేగంగా వ్యాపించే స్వభావం ఉంటుందని వైద్యులె చెబుతున్నారు. అంతేకాకుండా.. జేఎన్.1 లక్షణాలు, సీజనల్ వ్యాధుల లక్షణాలను పోలి ఉండటం వల్లే ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కరోనా, సీజనల్‌ను వెనువెంటనే గుర్తించడంలో కొంత అయోమయం ఏర్పడే అవకాశం ఉంది. అయినప్పటికీ గత కరోనా కాలంలో పని చేసిన అనుభవం, పరీక్షల ద్వారా వైద్యులు వీటిని గుర్తించగలుగుతారని నిపుణులు చెబుతున్నారు.




### నిర్లక్ష్యం వద్దు.. జాగ్రత్తలు తీసుకుంటే మంచిది

ప్రజలు జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే సాధారణ లక్షణాలే అని, సీజనలే కదా.. అని నిర్లక్ష్యం చేయవద్దు. సాధారణ జలుబు, జ్వరమైనా సకాలంలో చికిత్స తీసుకుంటేనే తగ్గుతుంది. లేకుంటే కొన్నిసార్లు సమస్య తీవ్రంగా మారే అవకాశాలుంటాయి. ప్రస్తుతం మరోసారి కరోనా ఉనికి కనిపిస్తున్నందున ఎలాంటి లక్షణాలున్నా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవడం, అవసరమైతే వైద్య పరీక్షలు చేయించుకోవడం అన్ని విధాల శ్రేయస్కరం. అదే సమయంలో జేఎన్.1 వేరియంట్ విషయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం మన రాష్ట్రంలో ఈ వైరస్‌కు సంబంధించి ఆందోళనకర పరిస్థితులు లేవు. కర్ణాటక, మహారాష్ట్ర, కేరళా రాష్ట్రాల్లో కేసులు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు పాటించడం మంచిది.

*- డాక్టర్ కిరణ్ మాదాల, క్రిటికల్ కేర్ నిపుణులు, నిజామాబాద్ ప్రభుత్వ దవాఖాన*

---

## నాటక రచనలో దిట్ట లక్ష్మీకాంతం



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ముషీరాబాద్, డిసెంబర్ 20: చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా బుధవారం ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత బలిజేపల్లి లక్ష్మీకాంతం సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా పాల్గొని.. లక్ష్మీకాంతం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బలిజేపల్లి లక్ష్మీకాంతం నాటక రచనలో దిట్ట అని, ఆయన రచించిన సత్యాహరిశ్చంద్ర నాటకం వేల ప్రదర్శనలతో తెలుగు ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హాస్యావధాని శంకర్ నారాయణ, వినయ్‌కుమార్, సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణ పొందితే సినీ పరిశ్రమలో మంచి అవకాశాలు

**దర్శకుడు మోహన్ గాంధీ**



బంజారాహిల్స్: టాలెంట్‌తో పాటు సరైన శిక్షణ పొందితే సినీ పరిశ్రమలో రాణించేందుకు అనేక అవకాశాలు వస్తాయని ప్రముఖ దర్శకుడు ఏ.మోహన్ గాంధీ అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో వినోద్ ఫిలిం అకాడమీ మూడో వార్షికోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. సీనియర్ దర్శకుడు మోహన్ గాంధీ మాట్లాడుతూ.. గతంలో నాటకరంగంలో అనుభవం ఉన్న వారికి నటించే అవకాశాలు ఎక్కువగా వచ్చేవని, మారిన కాలానికి అనుగుణంగా నటీనటులకు సోషల్ మీడియా ద్వారా కూడా అవకాశాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో దర్శకులు శివనాగేశ్వర్‌రావు, మాటల రచయిత లక్ష్మీభూపాల్, నటుడు ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం

**మలబార్ గోల్డ్ చైర్మన్ ఎం.అహ్మద్**

ఆర్కేపురం, డిసెంబర్ 20 : నాణ్యత విషయంలో రాజీపడకుండా.. వినియోగదారులకు నమ్మకంతో బంగారు ఆభరణాలు అందించడం వల్లే మలబార్ గోల్డ్, డైమండ్స్ ప్రజల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నదని మలబార్ గ్రూప్ సంస్థ చైర్మన్ ఎం.అహ్మద్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. దక్షిణాఫ్రికాలోని ర్యాండ్ రీఫైనరీ నుంచి వంద శాతం నాణ్యత గల బంగారాన్ని సేకరించడం ద్వారా మలబార్ నిబంధతను చాటి చెప్పిందని పేర్కొన్నారు. వంద శాతం నాణ్యత గల బంగారాన్ని సరఫరా చేయడంలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న ర్యాండ్ ప్యూర్‌తో భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ర్యాండ్ రీఫైనరీ సీఈవో సుబ్రహ్మణ్యన్ మలబార్ గోల్డ్ డైమండ్స్ సీనియర్ అధికారి సమక్షంలో ర్యాండ్ రీఫైనరీ సీఈవో ప్రవీణ్ బైద్యానాథ్ చేతుల మీదుగా ఒప్పంద పత్రం అందుకున్నారు.

## చీరకట్టుతోనే మగువ అందానికి హుందాతనం..!



సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : చీరకట్టుతోనే మహిళల అందానికి హుందాతనం చేకూరుతుందని ప్రముఖ యాంకర్ సుమ కనకాల అన్నారు. దేశంలోని అన్ని సంప్రదాయాల చీరలు నగరంలో లభించడం గొప్ప విషయమని ఆమె కొనియాడారు. వస్త్ర దుకాణాలు నగరంలో అధికంగా వెలుస్తున్నాయని చెప్పారు. మాదాపూర్‌లో బుధవారం కాంచిపురం నైరా సిల్క్‌లో కంచి ఉదయాక్షిని ప్రత్యేక కలెక్షన్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆమె విభిన్న రకాల చీరలతో సందడి చేశారు.

## విద్యార్థులు ఆధునిక విధానాలను అలవర్చుకోవాలి

**డాక్టర్ వినయ్‌కుమార్ నందికూరి**



సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సదస్సు నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 20: ప్రస్తుత ఆధునిక యుగంలో అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతికత విధానాలను విద్యార్థులు నేర్చుకోవాలని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్‌కుమార్ నందికూరి సూచించారు. అప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం శతాబ్ధి ఉత్సవాలలో భాగంగా 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ జువాలజీ – ఇన్నోవేషన్స్ చాలెంజెస్ అండ్ అపార్చునిటీస్' అనే అంశంపై మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నారు. సైన్స్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ఈ సదస్సు ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డాక్టర్ వినయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరిశోధనలవైపు దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. జీనోమిక్స్ రంగంలో విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. టీబీ వ్యాధిలో డ్రగ్ రెసిస్టెన్స్‌పై తన పరిశోధనా అనుభవాన్ని విద్యార్థులకు వివరించారు. రోగుల్లో యాంటిబయోటిక్స్ నిరోధకతకు ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. దానిపై సవివరమైన అధ్యయనాలు ఇప్పటికీ ఎన్నో జరిగాయని, మరెన్నో జరగాల్సిన అవసరం ఉన్నదన్నారు. అమెరికాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ ప్రొఫెసర్ సి. విజయసారథి మాట్లాడుతూ.. డీఎన్ఏ మరమ్మతులు, వ్యాధులు సంక్రమించేందుకు కారణాలు, పరిష్కారాలపై తన అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ, జువాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎం.మాధవి, జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ జితేందర్ నాయక్, కో జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీలు ప్రొఫెసర్ ఏవీ. రాజశేఖర్, ప్రొఫెసర్ సి. శ్రీనివాసులు, డాక్టర్ ఎస్. పద్మజ, ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణాసాగర్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## కొవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో.. ఉస్మానియాలో ఐసొలేషన్ వార్డు సిద్ధం

**డాక్టర్ బి.నాగేందర్**

సుల్తాన్‌బజార్, డిసెంబర్ 20: కొవిడ్–19 నూతన వేరియంట్ కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఉస్మానియా దవాఖానలో ముందు జాగ్రత్త చర్యలను చేపట్టినట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం దవాఖాన చాంబర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముందస్తు చర్యల్లో భాగంగా ఐసీయూ అవసరాలతో పాటు అన్ని సౌకర్యాలతో ఐదు పడకల ఐసొలేషన్ వార్డు సిద్ధంగా ఉన్నదన్నారు. నూతన వేరియంట్‌ను ఎదుర్కొనే క్రమంలో వెంటిలేటర్ల లభ్యత, ఆక్సిజన్ సరఫరా, తగినన్ని ఆర్‌టీపీసీఆర్ కిట్లు, మందులు ఎళ్లవేళలా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. దవాఖానకు వచ్చే రోగులు, రోగి సహాయకులు మాస్కుల వాడటం, చేతుల పరిశుభ్రత చర్యలు, సామాజిక దూరం పాటించేలా సిబ్బందిని అప్రమత్తం చేస్తామన్నారు. కొవిడ్–19 వ్యాప్తిని అరికట్టేందుకు రోగులందరూ దవాఖానలో ఉన్నా.. నివాసాల్లో ఉన్నా.. ముందు జాగ్రత్త చర్యలను పాటించేలా అవగాహన కల్పిస్తామన్నారు.

## తెలంగాణ.. నిజమైన కోటి రతనాల వీణ

**ఎంఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము**



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రపతి దౌపదీ ముర్ము

సిటీబ్యూరో, డిసెంబర్ 20(నమస్తే తెలంగాణ) : విశిష్టమైన సాంస్కృతిక వారసత్వ మూలాలు, పుష్కలమైన విద్యా, ఉద్యోగ వనరులతో పాటు కలిగిన రాష్ట్రంగా.. సిరిసంపదలతో సుభిక్షంగా ఉన్న ఈ తెలంగాణ నిజమైన కోటి రతనాల వీణ అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రముఖ విద్యా, వైద్య రంగాల్లో సామాజిక బాధ్యతతో సేవలందిస్తున్న ఎంఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 50 వార్షికోత్సవంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఐటీ కేంద్రంగా ఉన్న హైదరాబాద్, నిష్ణాతులైన ఐటీ మానవ వనరులతో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇక్కడి ఐటీ నిపుణులకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఉన్నదని ఆమె పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి వైద్య సేవలందించే స్థాయికి ఎదిగిందని, హెల్త్ కేర్ హబ్‌గా నిలుస్తోందని కొనియాడారు. ఎంఎన్ఆర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ 50 వార్షికోత్సవం ఆమె పాల్గొనడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా మంత్రి సీతక్క, చైర్మన్ ఎంఎస్ రాజు, వైస్ చైర్మన్ రవి వర్మ, డైరెక్టర్ ఆఫ్ అకాడమిక్స్ డా. రవి జీలకర్ర, ఫార్మా విభాగం ప్రిన్సిపాల్, డా. ఆళగర్ స్వామి, ఎంఎన్ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్ అసిస్టెంట్ డైరెక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.